www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 26 డిసెంబర్ 2023 | 5 | కాకినాడ

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ప్రారంభం అవుతాయని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. ఈ పోటీలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి లు ప్రారంభిస్తారన్నారు. నేటి నుంచి జనవరి 9 వరకూ సచివాలయం స్థాయి పోటీలు, 10 నుంచి 23 వరకూ మండల స్థాయి, 24 నుంచి 30 వరకూ నియోజకవర్గ స్థాయి, 31 నుంచి ఫిబ్రవరి 5 వరకూ జిల్లా స్థాయి, ఫిబ్రవరి 6 నుంచి 10 వరకూ రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. స్థానిక మహారాణి కళాశాలలో క్రికెట్ పోటీలు, లూథరన్ హైస్కూల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు, మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారన్నారు.

కలవరపెడుతున్న కొత్త వేరియంట్

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదు కోవిడ్ కేసులు నమోదు
- బాధితుల్లో ఆరు నెలల శిశువు
- వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అనేకమంది జీవితాలను అతలాకుతలం చేసి లక్షల మందిని పొట్టన పెట్టుకున్న కరోనా మహమ్మారి మళ్ళీ విస్తరిస్తుంది. కొత్త వేరియంట్ ఉమ్మడి జిల్లా ప్రజలను భయపెడుతోంది. కాకినాడ జిల్లాలో 4, తూర్పుగోదావరి జిల్లాలో 1 కేసు ఇప్పటికే నమోదవడంతో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గతంలో అత్యధిక కేసులు ఇక్కడే నమోదవడంతో అధికార యంత్రాంగం కోవిడ్ కట్టడి చర్యలకు దిగింది. కోవిడ్ కేసులు మళ్లీ విజృంభించే అవకాశం ఉన్నందున కాకినాడ డిఎంహెచ్ఓ కార్యాలయంలో 14 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 7207118051 నెంబర్‌ను సలహాలు సూచనల కోసం ఏర్పాటు చేశారు. కోవిడ్ చికిత్స కోసం కాకినాడ జిజిహెచ్‌తోపాటు తుని ఏరియా ఆసుపత్రి మిగిలిన అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను సిద్ధంగా ఉంచినట్లు డిఎం అండ్ హెచ్ఓ నరసింహనాయక్ ఇప్పటికే వెల్లడించారు. జిజిహెచ్‌లో పరీక్షలు ప్రతిరోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోవిడ్ చికిత్స కోసం ప్రత్యేకంగా 25 బెడ్‌లు గల వార్డును ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి తెలిపారు. ఐదుగురు వైద్యుల బృందం కరోనా సేవలు కోసం నియమించినట్లు తెలిపారు. దగ్గు, జలుబు వంటి లక్షణాలతో ఎవరైనా రోగులు బాధపడితే తక్షణం కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2020 జనవరి నుంచి మూడు దశల్లో అధికారిక లెక్కల ప్రకారం 3,09,046 కోవిడ్ కేసులు నమోదవ్వగా 1298 మంది మరణించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కల్లా ఇక్కడే ఎక్కువ కేసులు నమోదవడం ఆందోళన కలిగించింది. అధికారిక లెక్కల కంటే వేలల్లో కేసులు నమోదవడంతోపాటు, అదే స్థాయిలో మరణాలు కూడా సంభవించాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం కోవిడ్ కట్టడికి పటిష్ట చర్యలు తీసుకునేలా సన్నద్ధమవుతున్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలోనూ కోవిడ్ అనుమానిత లక్షణాలు ఉన్న వారికి వైద్య పరీక్షలు జరిపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడంతోపాటు జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాస్కులు ధరించి వెళ్లాలని, ఎటువంటి లక్షణాలు బయటపడినా వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి వెళ్లి కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కాకినాడ జిజిహెచ్‌లో ఆర్టిపిసిఆర్ పరీక్షలు చేసే ల్యాబ్ ను సిద్ధం చేశారు. ఇక్కడ రోజుకి సుమారు 5 వేల వరకూ టెస్టులు చేయవచ్చు. కోవిడ్ సేవలకు మళ్లీ సిబ్బందిని నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కేసులు పెరగకుండా నియంత్రించేందుకు సమీక్షలు చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కేసులు పెరగకుండా ఖచ్చితమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

చిన్నారులతో కేక్‌ను కట్ చేయిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సిఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించు

సమగ్ర శిక్షా ఉద్యోగులు ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి -కాకినాడ

'అసెంబ్లీ సాక్షిగా తమను రెగ్యులరైజ్ చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేసేలా సిఎం జగన్మోహన్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాధించు తండ్రి' అంటూ సమగ్ర శిక్షా ఉద్యోగులు క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగరంలోని ఇంద్రపాలెం లాకుల వద్ద గల అంబేద్కర్ విగ్రహం సెంటర్లో జరుగుతున్న నిరసన శిబిరంలో క్రిస్మస్ సందర్భంగా కేక్‌ను కట్ చేసి శాంతా క్లాస్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డికి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా యేసుక్రీస్తు జ్ఞానోదయం కల్పించాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, సమగ్ర శిక్షా ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు ఎం.చంటిబాబు మాట్లాడారు. మతాలకు ఖురాన్, బైబిలు, భగవద్గీత ఎంత పవిత్రమైనవో, రాజకీయ నాయకులకు అసెంబ్లీ అంత పవిత్రమైనదని, అంతటి పవిత్రమైన అసెంబ్లీ సాక్షిగా ప్రతిపక్ష నాయకుని హోదాలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని జగన్ హామీ ఇచ్చారని, నేడు సిఎంగా ఐదేళ్లు పదవీకాలాన్ని అనుభవించిన జగన్ ఇచ్చిన మాటను తప్పి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత 12 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో అప్పులు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారని, పెరిగుతున్న ధరలతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిన తరుణంలోనే ఇచ్చిన హామీని అమలు చేయాలని ఐదేళ్లుగా కోరుతూనే ఉన్నామని అన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రస్తుతం నిరవధిక సమ్మెలోకి దిగాల్సి వచ్చిందన్నారు. వాచ్‌మెన్ నుంచి టీచర్ల వరకూ 8 విభాగాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను ఇప్పటికైనా సిఎం జగన్మోహన్ రెడ్డి రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమాన వేతనాలను చెల్లించాలని 2013 లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని అమలు చేయకుండా ప్రభుత్వం కోర్టు ధిక్కారానికి పాల్పడుతుందని అన్నారు. తక్షణం టైం స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, రెగ్యులర్ చేయాలని అప్పటివరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఉద్యోగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరాన్ని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ వర్మ, పివివి రమణలు మద్దతు తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల జెఎసి జిల్లా కార్యదర్శి నాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు పివివి మహాలక్ష్మి, ఏ.లోవరాజు, సహాయ కార్యదర్శులు జి.నారాయణ, శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.రాజు, ఎం.గంగాధర్, రాధాకృష్ణ నాయకత్వం వహించారు.

క్రీడాస్ఫూర్తిని చాటేలా ఆడుదాం ఆంధ్ర

ప్రజాశక్తి - కాకినాడ

క్రీడా స్ఫూర్తిని చాటేలా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. మంగళ వారం నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పండుగ ఏర్పాట్లను కమిషనర్ నాగ నరసింహారావు సోమవారం సాయంత్రం పరిశీలించారు. స్థానిక ఆనందభారతి గ్రౌండ్స్‌లో ఈ క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ డాక్టర్ కతికా శుక్ల, ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి ప్రారంభిస్తారని ఎలిపారు. ఐదు క్రీడాంశాలలో జరిగే ఈ ఆడుదాం ఆంధ్ర పోటీలకు కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో సుమారు 23 వేల మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని అన్నారు. సచివాలయాల పరిధి లో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయికి ఆ తరువాత జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్లు చేయించుకున్న క్రీడాకారులు ఉత్సాహంగా పోటీలకు హాజరుకావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్య కుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఎసిపి నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

పట్టించుకునేదెవరు..?

రామవరంలో వృథాగా పోతున్న తాగునీరు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రామవరం గ్రామంలో పంచాయితీ కుళాయి నుంచి నీరు వృధాగా పోతున్న పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు వాపోతున్నారు. 16 వ జాతీయ రహదారి ప్రక్కనే ఒక ప్రక్క సచివాలయం ఉంటే, మరోపక్క వృధాగా పోతున్న నీటి కుళాయి ఉంది. నీరు వృధాగా పోతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

పండుగ మీకు... పస్తులు మాకా.!

ప్రజాశక్తి - యంత్రాంగం

'జగనన్న పండుగ నీకు..పస్తులు మాకా..' అంటూ అంగన్‌వాడీలు ప్లే కార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. గత 14 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అంగన్‌వాడీలు క్రిస్మస్ పండుగ రోజున కూడా పోరాట స్ఫూర్తితో వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ పట్ల సానుకూలంగా వ్యవహరించి న్యాయం చేయాలని అంగన్ వాడీలు కోరారు. **కాకినాడ** అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా చేపట్టిన నిరసన శిబిరం వద్ద రిలే నిరహారదీక్షను అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి ప్రారంభించి మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పండగ రోజున కూడా అంగన్‌వాడీలను రోడ్లు పాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశమంతా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటే మన రాష్ట్రంలో మాత్రం అంగన్‌వాడీలు కుటుంబానికి దూరంగా రోడ్డున పడి నిరసన వ్యక్తం చేయాల్సిన దుస్థితికి జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. తమ న్యాయమైన కోర్కెలను తీర్చడంలో జగన్మోహన్ రెడ్డికి ఏసుక్రీస్తు మంచి బుద్ధులు కలగజేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నగేష్, చక్రవర్తి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రభాకర్ వర్మ, లాయర్స్ యూనియన్ ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరాచార్యులు, జ్యోతి, దుర్గమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, కాకినాడ నగర అధ్యక్షులు పలివెల వీరబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి జి.రమణమ్మ, జ్యోతి, రామ, విజయ తదితరులు పాల్గొన్నారు. **కాజులూరు** స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. గత 14 రోజులుగా ప్రజాస్వామ్యయుతంగా అంగన్‌వాడీలు పోరాటాన్ని సాగిస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నా మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారని, అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించే వరకూ ఉద్యమం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌలు రైతులు సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు, అంగన్‌వాడీలు వరలక్ష్మి, హనుమావతి, అన్నవరం, కాదా సుజాత, రాయుడు సీత, సలాది లక్ష్మి జొన్నలగడ్డ సరోజిని, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్లో జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె శిబిరం సమీపంలో ఉన్న మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ప్లే కార్డులు ప్రదర్శించి నిరసన చేపట్టారు. యూనియన్ కార్యదర్శి దాడి బేబీ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలను పండగ రోజున నడిరోడ్డుపై నిలబెట్టారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింతగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగమణి, అమల, పద్మావతి, కె.దేవి, జె.సూర్యకుమారి, జ్యోతి, లోవతల్లి, వసంత కుమారి, వెంకటలక్ష్మి, నాగమణి, సావిత్రి, రత్నం, లక్ష్మి, లోవకుమారి, మహాలక్ష్మి, మంగాలక్ష్మి, రజని, స్నేహలత తదితరులు పాల్గొన్నారు. **కిర్లంపూడి** స్థానిక తహాశీల్దార్ కార్యాలయ సమీపంలో జరుగుతున్న అంగన్‌వాడీల రిలే నిరహారదీక్ష కొనసా గింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిం చేంత వరకూ సమ్మెను విరమించేది లేదని అంగన్ వాడీలు హెచ్చ రించారు. ఈ కార్య క్రమంలో పి.సావిత్రి, షేక్ పరివిన్, జి.రత్నం, పి. మంగాయమ్మ, పి.ప్ర భావతి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన దీక్షలో జగనన్న పండుగ నీకు...పస్తులు మాకా అంటూ ప్లే కార్డులు ప్రదర్శించి వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రత్నం, సుజాత, చంటి, తదితరులు నాయకత్వం వహించారు. **పిఠాపురం** స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.విశ్వనాథం, కుంచే చిన్న, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ టి.ఉదయ్ శ్రీనివాసులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, పండుగ రోజున కడా పస్తుల్లో ఉంచడం బాధాకరమని అన్నారు. అంగన్‌వాడీల సమ్మె విజయవంతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు తులసి, నళిని, అమల, భవాని, తదితరులు పాల్గొన్నారు. **కరప** అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన శిబిరంలో క్రిస్మస్ వేడుకను నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ శిబిరాన్ని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సిఐటియు జిల్లా కోశాధికారి ఎన్‌వి.రమణ, సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు మాట్లాడారు. 4 రోజుల నుంచి సమ్మె చేస్తున్న సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటి వరకూ శాంతియుతంగా సమ్మె చేశామని, 27వ తేదీ నుంచి ఎంపిలు, ఎంఎల్‌ఎలు, మంత్రులకు సామూహిక రాయబారాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జనవరి నెలలో కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని అంగన్‌వాడీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.వీరవేణి, ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, దైవకుమారి, అచ్చారత్నం, కల్పలత, సత్యామాధవి. ఎం భవాని, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు. **పెదపూడి** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్ద క్రిస్మస్ వేడుకను నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకురాలు మిరియాల రాజేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జి.సత్యవతి, ఎస్.కనకదుర్గ, వి.భారతి, బాంధవి, ఎస్ చాందిని, ఎ.శాంతరత్నం, మేరీరత్నం, నాగేంద్రమణి, బి.అరుణ, తదితరులు పాల్గొన్నారు. **కోటనందూరు** తుని పట్టణంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో క్రిస్మస్ వేడుక నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిఐయుటి నాయకురాలు ఎస్‌కె.పద్మ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంఓ సిఐటియు నాయకులు ఎన్.శ్రీనివాస్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బి.మేరీసమాధానం, రవణమ్మ, లోవరత్నం, సుబ్బలక్ష్మి, శాంతకుమారి, సత్యవేణి, పద్మ, లీల, శ్రీదేవి, ఇందిర, సుజాత తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** అంగన్‌వాడీల ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దుప్పి అదృష్టదీపుడు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పిఠాపురంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు ఉదయ శ్రీనివాస్

జగ్గంపేటలో శిబిరంలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



అసలు నేరస్తుల్ని వదిలేసి అడ్డమైన అక్రమ కేసుల్ని అమాయకులపై పెడితే.. ఏం సరిపోతాయ్..!!

తుని(కోటనందూరు)లో క్రిస్మస్ వేడుకలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. **కోటనందూరు** శాంతికి నిదర్శనం క్రైస్తవులు అని మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. పట్టణంలో సిబిసి చర్చిలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో క్రైస్తవులు శాంతికి నిదర్శనంగా ఉంటారని, భిన్నత్వంలో ఏకాత్వం గల భారతదేశంలో సర్వమతాలో సమానమైనవని అన్నారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌బి .పట్నంలో గిడియన్ ఆర్మీ వ్యవస్థాపకులు బిఎల్.రాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా వృద్ధులు, వికలాంగులకు నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కోటనందూరు, కె చెన్నయ్యపాలెం, జగన్నాధపురం, బిహెచ్.కోట గ్రామాల్లో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. **సామర్లకోట రూరల్** పట్టణంలో పలు క్రైస్తవ దేవాలయాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు ఏసుక్రీస్తు జన్మించిన సందర్భాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. దేవాలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. ఆంధ్ర బాప్టిస్ట చర్చిలో జరిగిన క్రిస్టమస్ వేడుకల్లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు పాల్గొని క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. సంఘ కాపరి రెవ. బి.కిరణ్ కుమార్‌ను, పలు దేవాలయాల్లో సంఘ కాపరులను రాష్ట్ర కార్మిక నాయకులు సుబ్బారావు దుస్సాలువాతో సత్కరించి గౌరవించారు. పేదలు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్, షారోన్ బాప్టిస్ట్ దేవాలయాల్లో జరిగిన వేడుకల్లో సంఘ కాపరి రెవరెండ్ ఆర్ లాజరస్ ఆధ్వర్యంలో దవులూరి దొరబాబు 200 మందికి వస్త్రాల పంపిణీ చేశారు. క్రిస్మస్ సందర్భంగా నిర్వహించిన కొవ్వొత్తుల ఆరాధన, కేక్ కటింగ్, చిన్నారులం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, పెద్దాపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, పాలిక కుసుమ చంటిబాబు, కానేటి రాజేశ్వరి, బుల్లి అప్పారావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పలు క్రైస్తవ మందిరాల్లో ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాళ్లరేవు పెంకె వారి పేటలోని న్యూ లైఫ్ బేతెస్త మందిరంలో ఫాస్టర్ అభిషేక్ రూభేన్, రూతమ్మ ఆధ్వర్యంలో చిన్నారులు క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వందలాది మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాంతి రాజు, తదితరులు పాల్గొన్నారు. జడ్‌పిటిసి దొమ్మేటి సాగర్ ఆధ్వర్యంలో తాళ్లరేవు ప్రధాన చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు. **పెద్దాపురం** పెద్దాపురం పట్టణంలో, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చిలో జరిగిన క్రిస్మస్ ప్రార్థనలలో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, దవులూరి సుబ్బారావు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కళ్యాణ్, సర్పంచులు, ఎంపిటిసిలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. స్థానిక యేసు కృపాలయంలో బోండా భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్ విడదాసరి రాజా, వైసిపి నాయకులు చింతా శ్రీనివాసరావు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పేదలకు వస్త్ర దానం చేశారు.

సామర్లకోటలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

నేరాలు ఘోరాలు

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

పూర్తిగా కాలిపోయిన గృహం

ప్రజాశక్తి - సీతానగరం

సింగవరం నాగరత్నం కాలనీలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. సింగవరం కాలనీలో దాసరి సత్యనారాయణ రామలక్ష్మి దంపతులు కొడుకు, కోడలు మనవళ్లతో తాటాకింట్లో నివసిస్తున్నారు. సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు చెలరేగడంతో మంటలకు ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో సామగ్రితో పాటూ రూ.80వేల నగదు, బంగారు వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. వారు కట్టుబట్టలతో వీధిన పడ్డారు.

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ఎదుర్లంక గ్రామ పంచాయితీ పరిధిలోని రామాలయంపేట గోదావరి ఒడ్డున సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతని వయసు 35 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై లేత ఆకుపచ్చ రంగు ఫుల్ హాండ్స్ షర్ట్, మెరూన్ రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని ఐ.పోలవరం ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు.

కొట్లాటపై కేసుల నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక స్థలం సరిహద్దు వివాదంలో ఇరువర్గాలు ఘర్షణ పడి కొట్టుకుని గాయపరచుకున్న సంఘటనపై పోలీసు కేసులు నమోదు చేశారు. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన మట్ట ఈశ్వర్ విష్ణువర్ధన్ వర్గం వేముల వీర పేర్రాజు వర్గం స్థలం సరిహద్దు వివాదమై ఈ నెల 24 గొడవపడ్డారు. కవ్వింపు చర్యలకు పాల్పడి కొట్టుకుని గాయపరచుకున్నారు. ఒకరిపై ఒకరు సోమవారం ఫిర్యాదు చేసుకున్నారు. ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్టు ఎఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కనక దుర్గ అమ్మవారిని దర్శించుకున్న నెహ్రూ

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం డ్రైవర్స్ కాలనీలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి పునప్రతిష్టాపనలో భాగంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సోమవారం దర్శించుకున్నారు. ఆయనతో పాటు గోకవరం మండలం నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ మృతి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కుమార రామ భీమేశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు అనారోగ్యంతో సోమవారం మెడికవర్ ఆసుపత్రిలో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా, కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలందించారు. అలాగే ఆయన తీసమణిని టిడిపి అభ్యర్థిగా పోటీ చేయించి కౌన్సిలర్‌గా గెలిపించారు. ప్రజారాజ్యం పక్షాన పెద్దాపురం ఎంఎల్ఎగా గెలిపొందిన పంతం గాంధీ మోహన్ విజయంలో కీలక పాత్ర పోషించారు. వైసిపిలో చేరిన ఆయన భీమేశ్వరాలయం ధర్మకర్తల మండలికి ఛైర్మన్‌గా ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందారు.

మట్టపల్లి మృతికి పలువురు సంతాపం

మట్టపల్లి రమేష్ బాబు మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, మాజీ ఎంఎల్ఎ పంతం గాంధీ మోహన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు దవులూరి సుబ్బారావు, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ ఛైర్మన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ ఛైర్మన్ ఊబా జాన్‌మోజేష్, గోకిన సునేత్ర దేవి లతోపాటు పలువురు అధికారులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు రమేష్ బాబు మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

కోకనాడ శతాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ

ఈనెల 28న కాకినాడ సూర్య కళామందిరంలో నిర్వహించే అఖిల భారత జాతీయ కాంగ్రెస్ కోకనాడ మహాసభల శతాబ్ది ఉత్సవానికి కాకినాడ నగరం సిద్ధమయ్యింది. నగరంలో వివిధ కూడళ్లలో హోర్డింగ్స్, ఫ్లెక్సులు, బ్యానర్స్, బ్రోచర్ల ద్వారా ప్రచారాన్ని చేపట్టారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 32 పాఠశాలలు కాలేజీల నుంచి సుమారు 130 వ్యాసాలు వచ్చాయని, వక్తృత్వ, దేశభక్తి గేయాల పోటీల్లో విజేతలకు 28న జరిగే కార్యక్రమంలో బహుమతులు అందించనున్నారు. వందేళ్ల క్రితం కాకినాడలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభల గ్రంధాన్ని మహాసభ రోజున ఆవిష్కరిస్తారు. ఈ మహాసభలకు కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, ఎపి శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద ముఖ్య అతిథులుగా పాల్గొంటారని నిర్వాహక కమిటీ వెల్లడించింది. మహాసభల సమావేశానికి డాక్టర్ పి.చిరంజీవిని కుమారి అధ్యక్షత వహిస్తారన్నారు. స్వాతంత్రోద్యమ ఘట్టాలు గాంధీజీపై ఫోటో సెషన్ ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహాసభ కార్యక్రమానికి కాకినాడ నగర ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహక కమిటీ సభ్యులు చింతపల్లి సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.

యానాం వార్తలు

సెలవులపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఇచ్చిన స్థానంలో సంక్రాంతి సెలవులుగా జనవరి 16, 17, 18, 19 తేదీల్లో సెలవులు ప్రకటించాలని ఉపాధ్యాయులు కోరినా అధికారులు పట్టించు కోకపోవడం విశేషం. సంక్రాంతి పండుగ సమయంలో విద్యార్థులు ఎవరు స్కూల్స్‌కి రారని, ఉపాధ్యాయ పని దినాలు వృధా అయినట్లేనని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కారైకల్, మాహే ప్రాంతాల్లో సెలవులు మార్చుకున్నారని, యానాంలో మాత్రం అతిపెద్ద పండుగైన సంక్రాంతికి సెలవులు ప్రకటించకపోవడంపై అంతరార్థం ఏమిటో తెలియడం లేదని పలువురు పేర్కొంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సంక్రాంతికి సెలవులు ఇవ్వకపోవడాన్ని ఖండిస్తున్నారు. డిసెంబర్ 26 నుంచి జనవరి 1 వరకు సెలవులు ఎందుకు ఇచ్చారో అర్థం కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. జనవరి 16, 17 తేదీలతోపాటు 18, 19 తేదీల్లో కూడా సెలవులు ప్రకటించాలని పలువురు కోరుతున్నారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - యానాం

యానాంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ సెల్వం, పుదుచ్చేరి కలెక్టర్ వల్లవన్‌లు సోమవారం యానాం పర్యటించారు. స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పరిపాలనాధికారి మునిస్వామి ఘన స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం యానాంలో నూతనంగా నిర్మించిన ఆయుష్ ఆసుపత్రిని, జిప్‌మెర్ ఆసుపత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం యానాం ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులకు పత్రాలను అందచేశారు. బిజెపి ప్రెసిడెంట్ కనకాల రాజు ఆధ్వర్యంలో స్థానిక కె.జంక్షన్‌లో మాజీ పిఎం అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎంఎల్ఎ అశోక్ కేంద్ర మంత్రి బృందం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారతదేశ సార్వభౌమత్వానికి దేశ సమగ్రతకు, శాంతి సౌభ్రాతృత్వానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన నానాజీ

ప్రజాశక్తి - కరప

కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పంతం నానాజీ

కరపలో తదేకం ఫౌండేషన్ వారి సహకారంతో కొత్తపేట ప్రాంతంలో జనసేన నాయకులు యర్ర వీర వెంకట సత్యనారాయణ స్వగృహంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని జనసేన పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పంతం నానాజీ సోమవారం ప్రారంభించారు. అనంతరం కరప గ్రామంలో క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. పాస్టర్ అబ్రహం శ్యామ్యూల్ పేత్ గాస్పల్ చర్చ్‌లో పంతం నానాజీ, ఆయన సతీమణి పంతం అరుణ, వారి కుమారులు సందీప్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో తదేకం ఫౌండేషన్ ప్రతినిధి చావ్వకుల సందీప్, జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, పేకేటి ప్రసాద్, భవాని శంకర్, పేపకాయల పవన్ కుమార్, పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లిన దత్తాత్రేయ మాలదారులు

ఇరుముడులతో బయలుదేరిన మాలదారులు

ప్రజాశక్తి - యు కొత్తపల్లి

ఉప్పాడకి చెందిన దత్తాత్రేయ మాలదారులు సోమవారం పిఠాపురం దత్తాత్రేయ క్షేత్రానికి కాలినడకన బయలుదేరి వెళ్లారు. ప్రతి ఏడాది గురుదత్త స్వామి బుజ్జి ఆధ్వర్యంలో దత్తాత్రేయ మాల ధరిస్తూ ఉంటారు. 41రోజులు కఠినమైన దీక్షను చేసిన మాలదారులు షిరిడి సాయి సేవ ఆలయంలో ఇరుముడులు కట్టుకుని శిరస్సుపై ధరించి పిఠాపురం దత్తాత్రేయ క్షేత్రానికి బయలుదేరి వెళ్లారు.

గోకవరంలో టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం రెవెన్యూ కార్యాలయం ఎదురుగా పైలా శ్రీను ఇంటి వద్ద టిడిపి నూతన కార్యాలయాన్ని సోమవారం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ నియోజవర్గంలో మొదటిగా గోకవరం నుంచి ఎన్నికల శంఖారావం ఈ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం ద్వారా మొదలైందన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం రాబోతుందన్నారు. అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో జగ్గంపేట నియోజకవర్గంలో త్వరలో భారీ సంఖ్యలో వైసిపి నాయకులు చేరనున్నారని తెలిపారు. అందుకుగాను ఆరు బస్సులను సిద్ధం చేశామన్నారు. ప్రజలలో మార్పు ఎప్పుడో మొదలైందని, ఇది జగన్ రాక్షస పాలనకు నిరద్శనమన్నారు. టిడిపిలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ న్యాయం

టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంఎల్ఎ జ్యోతుల

జరుగుతుందని, అది చూసే బాధ్యత తనదేనన్నారు. పార్టీ కోసం కార్యాలయాన్ని సిద్ధం చేసిన పైలా శ్రీనివాస్‌ను నెహ్రూ అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తాం...

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

వృద్ధులకు అన్నదానం చేస్తున్న టిడిపి నాయకలు

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాబోయే టిడిపి, జనసేన సంకీర్ణ ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తామని గండేపల్లి, జగ్గంపేట మండలాల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన రావు, మారిశెట్టి భద్రం అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో వారు పాల్గొని మాట్లాడారు. మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో 11 నెలలుగా నిర్విరామంగా దాతల సహకారంతో అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల తెలుగు రైతు ఉపాధ్యక్షులు అక్కిన సుదర్శన్ రావు ఆర్థిక సహాయంతో సోమవారం అన్నాక్యాంటీన్ ద్వారా భోజనంను సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. కొండబాబు, డి.సీతారామయ్య, జోగారావు, పాల్గొన్నారు.

బాపూజీ స్కూల్లో ఘనంగా క్రిస్మస్

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం బాపూజీ కాన్వెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించామని కరస్పాండెంట్ గూడూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. చిన్నారులు క్రిస్మస్ తాత, దేవదూత వేషధారణలో అలరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గూడూరి వెంకటేశ్వరరావు మాట్లాడారు. తమ పాఠశాలలో అన్ని పండుగలను నిర్వహిస్తామన్నారు. క్రిస్మస్ సందర్భంగా వారికి ఆటపాటలు, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించామన్నారు. ఈ కార్యక్రమం పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గోడివారి పేటలో జిజిఎంపి నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు ప్రారంభించారు. దశలవారీగా గ్రామంలో రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని సర్పంచ్ చిన్నవరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, పంచాయతీ వార్డు సభ్యురాలు గోడి ఆదిలక్ష్మి, వైసిపి రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలయ్య, వైసిపి నాయకులు మోటూరి సత్యం కాపు, నడింపల్లి సుబ్బరాజు, కటారి శివశంకర్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్లలో ఉన్న గ్రామదేవత శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు వేర్వేరుగా తమ పార్టీ శ్రేణులతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి తోరాటి సీతామహాలక్ష్మీ, సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో భారీ అన్నదానం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం సాదిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదానంలో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి-మండపేట

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి వచ్చేనెల ఆరో తేదీ వరకు గ్రామస్థాయిలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంపిడిఒ ఐదం రాజు తెలిపారు. ఈ క్రీడలకు 268 టీముల ఏర్పాటుకు టార్గెట్ కాగా ఇప్పటివరకు 137 టీమ్‌లు రిజిస్ట్రేషన్ అయ్యాయని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు స్థానికంగా ఉండే సచివాలయంలో రిజిస్టర్ చేసుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా భీమేశ్వర స్వామి పూజలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రసిద్ధిగాంచిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వర స్వామి జన్మ నక్షత్ర పూజలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి రుద్రాభిషేకం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు నిర్వహించిన ఈ పూజల్లో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఇఒ పి.తారకేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మెట్ల సత్యనారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణ రావు వర్ధంతి సందర్భంగా సోమవారం మెట్ల ఘాట్ వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన లేని లోటు పార్టీకి తీరలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎంఎల్ఎలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణ బాబు, జనసేన పార్టీ నాయకులు శెట్టిబత్తుల రాజబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు కౌన్సిలర్లు ఉన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

అంబాజీపేట మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణరావు వర్ధంతి సందర్భంగా అంబాజీపేట మండలంలో టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్య సమకూర్చిన దుపట్లను పేద ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మండల ప్రధాన కార్యదర్శి గూడాల ఫణి, నాయకులు గణపతి వీర రాఘవులు, బొంతు పెదబాబు, చిన్నం బాల విజయారావు, రవణం రాము, గుంటూరు మురళీకష్ణంరాజు, యడ్లపల్లి తుక్కియ్య, ఎ.సత్తిబాబు పాల్గొన్నారు.

అంబాజీపేటలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మనుస్మృతి ప్రతుల దహనం

ప్రజాశక్తి - తాళ్లరేవు, ముమ్మిడివరం

మనుస్మృతి ప్రతులను స్థానిక తహశీల్దార్ కార్యలయం వద్ద కెవిపిఎస్, విజ్ఞాన కళా మండలి ఆధ్వర్యంలో దహనం చేశారు. మనిషిని మనిషిగా చూడని మను ధర్మ శాస్త్రం మాకొద్దంటూ 1927 డిసెంబర్ 25న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేపట్టిన మనుస్మృతి ప్రతుల దహనంను గుర్తు చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు విప్పర్తి శ్రీనివాస్, విశ్వజన కళా మండలి జిల్లా అధ్యక్షులు వడ్డి.ఏడుకొండలు మాట్లాడుతూ 1927 డిసెంబరు 25న అంబేద్కర్ దహనం చేశారని, ఆ రోజును మానవ హక్కుల దినోత్సవంగా జరుపుతున్నట్లు తెలిపారు. అఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కె.ఈశ్వరి భాయి, టేకుమూడి ఈశ్వరరావు, పులపకూర కృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

కుల వ్యవస్థకు కారణమైన మనుస్మృతిని దగ్ధం చేసి, మానవ హక్కులను పరిరక్షించుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సీనియర్ నాయకుడు, సీనియర్ అడ్వకేట్ దొనిపాటి అంజనేయులు అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు అవరణలో పలు అంబేద్కర్ సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన సోమవారం మనుస్మృతి దహన దినాన్ని మానవ హక్కుల దినంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బుద్ధ పార్కు అవరణ నుండి జాతీయ రహదారి పైకి ర్యాలీగా వచ్చి ఎన్ హెచ్ 216 పై మనువు దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా కుల, వర్ణ వ్యవస్తను పెంచి పోషించే మనుస్మతి రాజ్యాంగ నిర్మాత డా బి ఆర్ అంబేద్కర్ 1927 డిసెంబర్ 25 న దహనం చేసి మానవ హక్కుల పరిరక్షణ కుడిగా నిలిచారన్నారు. నాటి స్ఫూర్తితో మానవ మనుగడకు అడ్డుగా నిలిచిన మనుస్మతి నీ దహనం చేద్దాం...మానవ హక్కులను కాపాడుద్దాం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శరత్, పంతగడి నరసింహ మూర్తి, దేవరపల్లి ఏడుకొండలు, కాశి సింహాద్రివర్య, కాశి మూర్తి, ఊర్మిళ చక్రవర్తి, ఇసుకపట్ల శివ, రేవు త్రిమూర్తులు, కవి రవి నాయకులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ముమ్మిడివరంలో మనుస్మృతి ప్రతుల దహనం

తామరాకుతో పంచాయతీకి ఆదాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామంలోని ఊర చెరువు ద్వారా పంచాయతీకి రూ.లక్ష పైన ఆదాయం లభించినట్లు పసలపూడి సర్పంచ్ కట్టా లక్ష్మి తెలిపారు. పసలపూడి గ్రామంలో ఉన్న ఊర చెరువును గ్రామస్తులు గతంలో మంచినీటి చెరువుగా ఉపయోగించుకునేవారు. కాలువ నీటిని చెరువులోకి మళ్లించి, ఆ నీటిని శుభ్రపరచి, మంచినీటిని గృహ అవసరాలకు వినియోగించుకునేవారు. కాలక్రమేణా అనేక ప్రాంతాలలో చెరువులు కనుమరుగైనా మండలంలోని పసలపూడి, సూర్యారావుపాలెంలో మాత్రం రెండు చెరువులు ఇప్పటికీ నీటితో కళకళలాడుతూనే ఉన్నాయి. పసలపూడి ఊర చెరువు తామర పువ్వులు, తామర ఆకులకు ప్రసిద్ధిగాంచింది. శ్రావణ మాసం, వినాయక చవితి వంటి పండుగలకు ఎక్కువగా కలువ పువ్వులు, తామర పువ్వులు వినియోగించడం కారణంగా వీటికి డిమాండ్ ఉంటుంది. ఆకులు మాంసం దుకాణదారులు పొట్లం కట్టేందుకు వాడుతారు. ఇది కొంతవరకు పర్యావరణ కాలుష్యం పెరగకుండా నివారించేందుకు కూడా ఉపయోగపడుతుంది. ప్రసిద్ధితోపాటు ఈ సంవత్సరం ఆదాయం కూడా సాధించినట్లు సర్పంచ్ తెలిపారు. చెరువు బహిరంగ వేలం ద్వారా సుమారు రూ.లక్ష పైగా ఆదాయం పంచాయతీకి లభించినట్లు సర్పంచ్ తెలిపారు. తామరాకుల వ్యాపారి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రధానంగా తామర ఆకులను మాంసం పొట్లం కట్టేందుకు వాడతారని, మాంసపు దుకాణదారులు తమ వద్దకు వచ్చి ఆకులు కొనుగోలు చేస్తారన్నారు. ఈ ఆకుల వ్యాపారం ద్వారా జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు.

ఉండ్రాజవరంలో ఊర చెరువు

అమ్మకానికి సిద్ధమైన ఆకులు

విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ప్రోత్సాహకాలు అందజేశారు. మాజీ ఎంపిపి ఊటుకూరి సుబ్రమణ్య స్వామి అధ్యక్షతన బండారులంకలో నిర్వహించిన సభలో సుమారు రూ.4 లక్షల నగదు, ఇంజినీరింగ్, డిప్లొమా చదువుతున్న దేవాంగ విద్యార్థులకు సంఘ పెద్దల సమక్షంలో పంపిణీ చేశారు. కోనసీమలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 200 మంది దేవాంగ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున పంపిణీ చేశారు. విద్యా వ్యాప్తికి ప్రోత్సాహకంగా ఇస్తున్న ఈ రూ.2 వేలు భవిష్యత్‌లో రూ.5 వేలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తూ సంఘ మూల నిధిని రూ.కోటి సమకూర్చేందుకు దేవాంగ ప్రముఖుల సహాయ సహకారాలు తీసుకుంటున్నట్లు సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు చింతా శంకరమూర్తి, చింతా వీరభద్రేశ్వర రావు, పిచ్చిక శ్యామ్, ఉప్పుగంటి నాగమల్లేశ్వర రావు, బళ్ల వెంకటేశ్వరరావు, పిచ్చిక పొలిశెట్టి, కారుపర్తి సాయి, దైవపు నందయ్య, ములికి విఘ్నేశ్వరుడు, కార్టూనిస్ట్ మాడా రాము, బాసిన శివన్నారాయణ, చింతపట్ల గంగా సత్యన్నారాయణ, బళ్ల చక్రవర్తి, ఇనుమర్తి సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్రసాయికి మామిడికుదురు ప్రాజెక్ట్

ప్రజాశక్తి -మామిడికుదురు

రామచంద్రపురం హైస్కూల్లో నిర్వహించిన జిల్లా సాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో మామిడికుదురు హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి శ్రీరామ్ రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర సాయి సైన్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.చిట్టినీడి నిరంజని తెలిపారు. అగ్రికల్చర్ ఇన్సక్ట్ టాపర్ ప్రాజెక్ట్ విద్యార్థి శ్రీరామ్, గైడ్ చొప్పల గోపిని ఎంఇఒలు ఎస్‌విఎస్.లక్ష్మీ నారాయణ, ఎం.వెంకన్నబాబు, హెచ్‌ఎం ఎం.నిరంజని అభినందించారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రశంసిస్తున్న ఉపాధ్యాయులు